క్లుప్తంగా

నేడు మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నాయని, ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఉచితంగా తాగునీరు, ప్రసాదాలతో పాటు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు.

అధ్వానంగా కెనాల్ మట్టిరోడ్డు



కెనాల్ మట్టిరోడ్డుకు పడిన గోతులు

కె.కోటపాడు : మండలంలో మెరక రామచంద్రపురం నుం,చి పాతవలస వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు గల రైవాన కెనాల్ మార్గం పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ మట్టిరోడ్డు మార్గం గుండానే అధిక బరువులతో కూడిన వాహనాల రాకపోకలు జరగనుండడంతో రోడ్డు అధ్వానంగా మారుతుంది. ఈ ఛిద్రమైన రోడ్డు మార్గంలో పలు చోట్ల గోతులు ఉండడంతో పాటు ఈ రోడ్డును ఆనుకుని రైవాడ కెనాల్ గుండా నీరు ప్రవహిస్తుంది. గోతుల్లో పడి అదుపుతప్పిన వాహనదారులు కెనాల్ మార్గంవైపు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ సమస్యను గుర్తించి ఈ మట్టిరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తామరబ్బలో ఉచిత వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి : తామరబ్బలో భగవాన్ సత్య సాయి సేవా సంస్థల అనకాపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సమగ్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సత్య సాయి సేవా సంస్థల జోన్ ఇంచార్జి రవిశంకర్ తెలిపారు. తామరబ్బ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తామరబ్బ, చింతలపూడి పంచాయతీల పరిధిలోని శివారు గ్రామాల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకులు, కీళ్ల నొప్పులు, కంటి, గొంతు, ముక్కు, చెవి, దంత, చర్మ, క్యాన్సర్, పిల్లల, స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

200 ఎకరాల్లో వేరుశనగ సాగు



వారాడలో సాగులో ఉన్న వేరుశెనగ పంట

కె.కోటపాడు : ఖరీఫ్ కాలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేసేందుకు ఆశక్తి చూపుతున్నారు. ప్రధానంగా మండలంలో గల భూములు వర్షాధారంగా ఉండడంతో పాటు వేరుశనగ పంట తక్కువ కాలవ్యవధిలో అందిరావడంతో సాగులో లాభదాయకంగా ఉంటుందని సాగు రైతులు పేర్కొంటున్నారు. మండలంలో మెట్ట ప్రాంత గ్రామాలైన చిరికివానిపాలెం, ఆర్.వై.అగ్రహారం, ఉగ్గినవలస, ఆనందపురం, వారాడ, కొత్త అగ్రహారం, గుల్లేపల్లిలలో 200 ఎకరాల్లో వేరుశనగ పంట సాగులో ఉంది. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు కలిగించాయని సాగు రైతులు తెలుపుతున్నారు.

గంటిపంట సాగుపై రైతుల ఆసక్తి



కింతాడలో కోతదశలో ఉన్న గంటిపంట

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో రైతులు గంటి పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గంటిపంటలో మంచి పోషక విలువలు ఉండడంతో ఈ పంటకు మంచి డిమాండ్ ఉంది. గంటి పంటతో వివిధ ఆహర పదార్థాలను తయారు చేసి తీసుకోవడం వలన మంచి ఆరోగ్యం సమకూరనుండడంతో మార్కెట్‌లో పంటకు మంచి మద్దతు ధర లభిస్తుంది. దీంతో పంట సాగు లాభదాయకంగా ఉండడంతో మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. కె.సంతపాలెం . కె.కోటపాడు, కింతాడ, సూదివలస, గుల్లేపల్లి, గరుగుబిల్లి గ్రామాల్లో 60 ఎకరాల్లో గంటిపంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటను 20 రోజుల తరువాత కోతలు చేపట్టి నూర్పు చేయనున్నట్టు రైతుల పేర్కొంటున్నారు.

ఆలనాపాలన లేని అతిథి గృహాలు



చోడవరంలో నిరుపయోగంగా ఉన్న కోనాం గెస్ట్‌హౌస్

- వందేళ్ల చరిత్ర గల హార్డింజ్ గెస్ట్‌హౌస్
- నిర్వహణ లోపంతో కోనాం గెస్ట్‌హౌస్‌కు తాళాలు
- నేడు శిథిలావస్థకు చేరిన భవనాలు
- పట్టించుకోని ప్రభుత్వం



చోడవరంలో శిథిలావస్థలో ఉన్న వందేళ్ల కిందట నిర్మించిన బ్రిటిష్ కాలం నాటి హార్డింజ్ గెస్ట్‌హౌస్

చోడవరం : ఒకనాడు బ్రిటిష్ దొరలతో పాటు నేటి మన పాలకుల వరకు అతిథులెందరికో ఆతిథ్యం ఇచ్చిన ప్రభుత్వ అతిథి గృహాలు నేడు ఆలనా పాలనా లేకుండా శిథిలావస్థకు చేరుకున్నాయి. మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు, వివిధ రంగాల ప్రముఖులు సైతం నాడు ఉపయోగించుకొని నేడు పట్టించుకోకుండా వదిలేశారు. బ్రిటిష్ దొరలు, విజయనగర రాజులు సైతం ఇక్కడకు జమాబందీ కోసం వచ్చినపుడు ఈ అతిథి గృహాల్లో విశ్రాంతి తీసుకొనేవారు. అంతటి వందేళ్ల చరిత్ర వున్న వసతి గృహాలు కూడా ఇక్కడ ఉన్నాయి. చోడవరం కేంద్రంగా నాడు బ్రిటిష్ పాలనలో పన్నులు వసూలు చేసేందుకు తెల్లదొరలు వస్తే విశ్రాంతి తీసుకునేందుకు ఇక్కడ హార్డింజ్ గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. సుమారు వందేళ్లకు పైబడి అతిథులకు విశ్రాంతి ఇచ్చిన ఈ భవనం ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. చోడవరం పేరు చెబితే అందరికీ గుర్తుకొచ్చే మరో అతిథి గృహం కోనాం గెస్ట్ హౌస్. చీడికాడ మండలం కోనాం కొండల్లో రిజర్వాయరు నిర్మించేటప్పుడు ఈ గెస్ట్‌హౌస్‌ను కట్టారు. నిర్మాణ పనులు పర్యవేక్షించేందుకు ఈ కోనాం గెస్ట్‌హౌస్‌ను చోడవరంలో నిర్మించారు. రెండు ఏసీ గదులతో పాటు రెండు సూట్లు, పలు రూమ్‌లు, డైనింగ్ రూమ్‌తో పాటు ముఖ్యమంత్రులు, మంత్రుల కాన్వాయ్‌ల రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక రోడ్డుతో కూడిన ప్రహరీ, చుట్టూ పచ్చని మొక్కలతో ఎంతో అందంగా ఈ గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. చాలా కాలం పాటు వీవీఐపీలకు అతిథి గృహంగా ఉండేది. ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వచ్చినపుడు విశ్రాంతికి ఈ అతిథి గృహాన్ని వినియోగించేవారు. అయితే గత ఐదేళ్లుగా కోనాం గెస్ట్‌హౌస్ నిరుపయోగంగా మారింది. ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణలో ఉన్నప్పటికీ వారు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, నిర్వహణ సరిగ్గా చేయడం పోవడంతో నిరుపయోగంగా మారింది. మొదట్లో విద్యుత్ సరఫరా నిలిపివేయగా తర్వాత నిర్వహణ లోపంతో అంతా బూజు పట్టింది. ఆవరణలో ఉన్న చెట్లు భవనంపై కూలిపోవడంతో కొంతమేర దెబ్బతింది. దీంతో ఈ గెస్ట్‌హౌస్‌కు పూర్తిగా తాళాలు వేసేశారు. రాజుల కాలంలో చోడవరానికి 4 కిలోమీటర్ల సమీపంలో గజపతినగరంలో ఒక భవనాన్ని నిర్మించారు. విజయనగరం సంస్థానానికి చెందిన ముఖ్యులు ఎవరైనా వస్తే విశ్రాంతి కల్పించేందుకు ఈ అతిథిగృహాన్ని అప్పట్లో నిర్మించారు. గుర్రాల శాల కూడా ఉండేది. క్రమేణా ఆర్అండ్‌బీ బంగ్లాగా మారి పూర్తిగా శిథిలమైపోయి ఆక్రమణలకు గురైంది. ఎంతో గొప్ప గెస్ట్‌హౌస్‌లు ఉన్నప్పటికీ అవి శిథిలమైపోవడంతో ఈ ప్రాంతంలో అతిథి గృహాలే కరువయ్యాయి. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ గెస్ట్‌హౌస్ మాత్రమే ఇపుడు ఏకైక అతిథి గృహంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని అతిథి గృహాల మరమ్మతులు చేయడం లేదా వాటి స్థానే కొత్త అతిథి గృహాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి తరలిరండి

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : ఈ నెల 13న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నం స్టార్‌హోమ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ పెద్దలు దిశా నిర్దేశం చేస్తారన్నారు. నిర్ణీత సమయానికి నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు సమావేశ ప్రాంతానికి చేరుకోవాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ సూచించారు. పార్టీ శ్రేణులు అంతా విధిగా హాజరు కావాలన్నారు.

గొలుగొండ : నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే కార్యక్రమానికి మండలం నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలు తప్పకుండా హాజరు కావాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొరుప్రోలు పాణీ శాంతారాం తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిన సందర్భంగా బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నర్సీపట్నంలో నిర్వహించడం జరుగుతుందని, దీనికి మండలంలో ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంతా హాజరుకావాలని కోరారు.

నాతవరం : వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ధర్మసాగరం స్టార్ హోమ్ కల్యాణ మండపంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా పార్లమెంటు పరిశీలకురాలు శోభా హైమావతి విచ్చేస్తారని, కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీశ్రేణులంతా విధిగా హాజరుకావాలన్నారు.

ఆశాజనకంగా అపరాల దిగుబడి



సేకరించిన పెసరబొట్టలు ఎండబెడుతున్న రైతు



కోత కోసి కుప్ప పెట్టిన నువ్వుపంట

రోలుగుంట : అపరాల పంటలు సేకరణ, సంరక్షణ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పెసలు, బొబ్బర్లు, మినుము తదితర అపరాల పంటలు, నువ్వు పంటను విస్తారంగా సాగు చేశారు. తుపాను ప్రభావంతో అడపాదడపా కురిసిన వర్షాలు పంటలకు కలిసొచ్చాయి. తరువాత వాతావరణం మారి ఎండలు కాయడంతో రైతులు పంటల నుంచి బొట్టలు సేకరించి ఎండలో ఎండబెట్టుకుంటున్నారు. నువ్వు చేను కూడా కోసి కుప్పలు పెట్టుకున్నారు. కుంచం పెసలు, మినుములు రూ.300 పలుకుతుందని రైతులు చెబుతున్నారు. మరో వైపు వర్షాలు కురవక వరి ఆకుమడులు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

క్వారీ పనులను అడ్డుకున్న దళిత రైతులు



క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న దళిత రైతులు

మాకవరపాలెం : పంటలకు నష్టం కలిగించే క్వారీ తెరవద్దంటూ మండలంలోని జీకోడూరు గ్రామానికి చెందిన దళిత రైతులు మరోసారి ఆందోళనకు దిగారు. జీకోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో గతంలో నల్లరాతి క్వారీ నిర్వహించేవారు. కొంత కాలంగా నిలిపివేసిన క్వారీని ఇపుడు మళ్లీ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై 15 రోజుల క్రితం క్వారీ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం క్వారీని ప్రారంభించేందుకు లీజుదారులు క్వారీ వద్దకు చేరుకోవడంతో రైతులు పనులు చేయకుండా అడ్డుకున్నారు. రూరల్ సీఐ రేవతమ్మ, స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు క్వారీ వద్దకు చేరుకుని ఎలాంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

కె.జె.పురంలో ఘనంగా జగన్నాథస్వామి అండీలు పండగ



కె.జె.పురంలో జగన్నాథస్వామి అండీలుతో తాచేరు నది నుంచి ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : జగన్నాథస్వామి రథయాత్ర తర్వాత స్వామివారి అండీలు పండగ కె.జె.పురం గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర జరిగిన మరుసటి వారంలో వచ్చే శనివారం ఈ గ్రామంలో అండీల్ల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులు శనివారం ఉదయం పెద్ద పెద్ద కుండలు(అండీలు) పట్టుకుని ఊరేగింపుగా సమీపంలో గల తాచేరు నదికి వెళ్లి, అక్కడ కుండల్లో నీరు, పండ్లు నింపుకుని ఇళ్ల వద్దకు వచ్చి పరమాన్నం, భోజనాలు వండి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు పెట్టారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తాచేరు నదికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట : విజయరామరాజుపేట గ్రామంలో జగన్నాథస్వామి పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో పౌర్ణమి వెళ్లిన తరవాత వచ్చే శనివారం రోజున జగన్నాథస్వామి పండగను చేయడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామస్తులంతా నీటి కుండలతో జగన్నాథస్వామి పీఠం వద్దకు వెళ్లి ప్రసాదాలు వండి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి వసంతంను తమపైన, ఇళ్లల్లో, పశువులపై జల్లి ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని గ్రామస్తులు పూజలు చేశారు.



పేటలో జగన్నాథస్వామి ఆలయానికి నీటి కుండలతో వెళ్తున్న గ్రామస్తులు

సమస్యల వలయంలో జగనన్న కాలనీ



కాలనీలో అధ్వానంగా తయారైన రోడ్డు

రావికమతం : గృహాలు లేని నిరుపేదలకు గత వైఎస్సార్ ప్రభుత్వం స్థలాలు ఇచ్చి గృహాలు కూడా మంజూరు చేసింది. దీనిలో భాగంగా కొత్తకోట, కన్నంపేట, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం గ్రామాల్లో 260 మంది ఇల్లు లేని నిరుపేదలను అధికారులు గుర్తించి వారికి స్థలంతో పాటు గృహాలను మంజూరు చేశారు. అయితే వారికి వారి వారి గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో కొత్తకోట కు రెండు కిలోమీటర్ల దూరంలో వ్యవసాయ భూములును కొనుగోలు చేసి కొత్తకోట, కన్నంపేట, జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం గ్రామాల గల 260 మంది లబ్ధిదారులకు అప్పటి ఎమ్మెల్యే ధర్మశ్రీ పట్టాలు అందించి నిర్మాణాలు చేపట్టారు. వారిలో సుమారుగా 100 మంది వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి వాటిలో నివాసం ఉంటున్నారు. అప్పటి ప్రభుత్వం ఈ కాలనీ కరెంటు, మట్టి రోడ్లు, మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారి అధ్వానంగా తయారైంది. వీధి లైట్లు వెలగక పోవడంతో రాత్రుళ్లు భయంతో కాలం గడుపుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా కాలనీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, గతంలో పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లామని, వారు పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. "పంచాయితీ పెద్దలు, అధికారులు ఇప్పటికైనా సరే జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి విశేష అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని వజ్ర కవచాలంకృతులతోపాటు పూలమాలలతో అందంగా అలంకరించారు. ఆషాఢ మాసం శనివారం పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణ చేసి విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా దర్శించారు. స్థానిక గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో మండల దీక్షలు

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా గణపతి రామాలయంలో వారం రోజులుగా మహిళలు లలితా సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజు లలితాదేవి కలశాన్ని నెలకొల్పి మండల దీక్షగా తీసుకొని దీన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఇది 42 రోజులపాటు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేస్తున్న అర్చకులు



కలశాలతో అష్టోతర పూజలు

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం విజయబాబు, గిరిబాబుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి వివిధ పూజలు, చక్రస్నానం, పూర్ణాహుతి హోమం, స్వామివారికి ఏకోత్తర సహస్ర((1001) కలశాలతో 108 కలశాలతో అష్టోతర పూజలు, సాయంత్రం ధ్వజావరోహణ, లక్ష తులసి, లక్ష కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు విజయబాబు మాట్లాడుతూ 400 సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయంలో 1870లో ధ్వజస్తంభ పునః ప్రతిష్ట జరిగిందన్నారు. ఇది వంద సంవత్సరాల పూర్తయిన సందర్భంగా వజ్జల నరసింహాచార్యులు ఆధ్వర్యంలో 1970లో పవిత్రోత్సవాలు ప్రారంభించారన్నారు. ఆనాటి నుంచి ఏటా సప్త ఆనిహిక పవిత్రోత్సవం పాంచరాత్ర, ఆగమోక్తముగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు పులఖండం ప్రసాద్, రాజేష్, ఈవో బి.మురళీకృష్ణ, చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో ప్రజల మన్ననలు



సత్యవతి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, సినీ డైరెక్టర్ పరశురాం



నివాళులర్పిస్తున్న నెక్కల నాయుడుబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సన్యాసిపాత్రుడు, ఎంపీపీ లక్ష్మణమూర్తి, పార్టీ నాయకులు

నాతవరం : ప్రతి ఒక్కరూ మానవతా సేవా దృక్పథం అలవర్చుకుంటే సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్, విజయనగరం డీసీసీబీ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. మండలంలో చెర్లోపాలెం గ్రామంలో సినీ నటుడు, మాజీ రాష్ట్ర కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు మాతృమూర్తి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. కుటుంబీకులు, రాజకీయ పార్టీ నాయకులు, స్నేహితులు సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పించి, జోగినాయుడును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, ఎంపీపీ లక్ష్మణమూర్తి వైస్ ఎంపీపీ పైల సునీల్, రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు పైల పోతురాజు, గొలుగొండ మండలం జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఉమ్మడి రాష్ట్ర ఎంపీటీసీల సంఘం మాజీ కార్యదర్శి పెట్ల అప్పలనాయుడు, చెర్లోపాలెం సర్పంచ్ పైల శిరీష, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభ



జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మొల్లి సన్నిబాబు, సంఘం నాయకులు

అనకాపల్లి: విజయవాడలో ఈనెల 17న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొల్లి సన్నిబాబు తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ విజయరెసిడెన్సీ హాల్లో మహాసభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో బీసీలను ఓటు బ్యాంకుగానే ప్రజాప్రతినిధులు వాడుకుంటున్నారన్నారు. బీసీ వర్గీకరణ చేసి రాజ్యాధికారం వచ్చే వరకూ పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందన్నారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. చట్ట సభలతోపాటు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కిల్లాడ అప్పలరాజు, బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, జిల్లా నాయకులు రంధి గణపతి, బండారు అప్పారావు, ఊరిగిటి నాగమణి, దాలి బోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం హైమావతి సూచించారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రతీ గది క్షుణంగా తనిఖీ చేశారు. అనంతరం రోగులతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ప్రధానమంత్రి జన యోజన కింద ఆరోగ్య కార్డులు ఎంత మందికి నమోదు చేశారు, నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ వాణి జగదీశ్వరీ, సీహెచ్‌వో డి. శారద, డిప్యూటీ హెచ్ఈవో బి. మంగమ్మ పాల్గొన్నారు.